@netifocusnews @focustv
http://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | హైదరాబాద్ | ఆదివారం 24, నవంబర్ 2024 | పేజీలు: 04

## హైదరాబాద్ తాగునీటి అవసరాలపై దృష్టి



- కార్యాచరణ రూపొందించాలని ఆదేశం
- అధికారులతో సమీక్షించిన సిఎం రేవంత్
- రైతులకు అవగాహన కలిగించేలా సదస్సు
- రైతులంతా తరలి వచ్చేలా చూడాలి
- మహబూబ్‌నగర్ సదస్సుపై సిఎం సమీక్ష



సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్, మంత్రి తుమ్మల

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 23:

హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం 20 టీఎంసీ ల గోదావరి జలాల తరలింపు పైన ముఖ్యమంత్రి సమీక్షించారు.. తన నివాసంలో జలమండలి, ఇరిగేషన్ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి తరలింపు పైన సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఏ ప్రాజెక్టు నుంచి నీటి తరలింపునకు ఎంత వ్యయం అవుతుంది, నీటి లభ్యత పైన పూర్తి అధ్యయనం చేయాలని సూచన..చేశారు. వచ్చే నెల 1వ తేదీ వరకు టెండర్లకు మిగతా 2లో..



## వయనాడ్‌లో ప్రియాంక భారీ మెజార్టీ

- తొలిసారి లోక్‌సభలో అడుగుపెడుతున్న చెల్లి
- అన్న రాహుల్ మెజార్టీని దాటేసి రికార్డ్ మెజార్టీ
- రికార్డ్ మెజార్టీపై సిఎం రేవంత్ హర్షం

వయనాడ్, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 23:

కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీ తొలి అడుగులోనే విజయఢంకా మోగించారు. వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో భారీ విజయాన్ని దక్కించుకున్నారు. ఈ స్థానంలో తన సమీప అభ్యర్థిపై 3.94లక్షలకు పైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. దీంతో అన్నా చెల్లెల్లిద్దరూ లోక్‌సభ సభ్యులయ్యారు. తల్లి సోనియా ఇప్పటికే రాజ్యసభలో ఉన్నారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ స్థానంలో తన సోదరుడు రాహుల్ గాంధీ సాధించిన 3.64లక్షల ఓట్ల మెజార్టీని మిగతా 2లో..

## రెండు రాష్ట్రాల్లోనూ అధికారం యధాతథం



- మహారాష్ట్రలో మహాయతి కూటమిదే అధికారం
- జార్ఖండ్‌లో మళ్లీ సత్తా చాటిన హేమంత్ సోరెన్
- జార్ఖండ్‌లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తారుమారు

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్ న్యూస్) -నవంబర్ 23:

మహారాష్ట్ర, ఝూర్ఖండ్ శాసనసభల ఎన్నికల ఫలితాలు శనివారం వెల్లడయ్యాయి. మహారాష్ట్రలో అధికార మహాయుతి కూటమి అఖండ విజయం సాధించింది. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి కనీస పోటీ ఇవ్వలేకపోయింది. అటు ఝూర్ఖండ్‌లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు భిన్నంగా జేఎంఎం కూటమి జోరు ప్రదర్శించింది. ఈ క్రమంలో ఈ రెండు పార్టీలు మరోమారు ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం ఖాయమైంది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ సౌత్ వెస్ట్‌లో భాజపా అభ్యర్థి, రాష్ట్ర ఉపముఖ్య మంత్రి దేవేంద్ర మిగతా 2లో..

### ప్రజలంతా మోడీ వెంటే

- సిఎం ఎవరన్నది కూటమి నిర్ణయిస్తుంది
- ఫలితాలపై మాజీ సిఎం ఫడ్నవీస్ స్పందన

వివరాలు 02లో..

### వ్యూహాత్మకంగా బిజెపి ఎత్తులు

- ఓబిసి ఓట్ల సమీకరణలో విజయం
- మహిళలను ఆకట్టుకోవడంలోనూ పైచేయి
- మహాయతి విజయంలో వీరే కీలకం

2



## ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీ తప్పనిసరి

- యూపి ఘటనతో అప్రమత్తం అయిన ప్రభుత్వం
- అధికారులకు స్పష్టమైన ఆదేశాలించిన దామోదర

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 23:



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానాలు, ప్రైవేటు ఆస్పత్రుల్లో ర్ సేఫ్టీపై వెంటనే తనిఖీలు నిర్వహించి నివేదిక తయారు చేయాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణపై ఆరోగ్యశాఖ అధికారులతో మంత్రి రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. మిగతా 2లో..

## ప్రాంతీయ పార్టీలే బలమైన పునాదులు

- మహారాష్ట్రలో రేవంత్ పప్పులు ఉడకలేదు
- ఎక్స్‌లో పోస్ట్ చేసిన కెటిఆర్
- రైతుల పక్షాన పోరాటానికి జైలు
- పట్నం మహేందర్‌కి కెటిఆర్ పరామర్శ
- రేవంత్ తప్పులను ప్రజలు లెక్కిస్తున్నారు

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 23:

దేశ భవిష్యత్‌కు ప్రాంతీయ పార్టీలే బలమైన పునాదులనే విషయం మహారాష్ట్ర, ఝూర్ఖండ్ ఫలితాలతో తేలిపోయిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. బలమైన ప్రతిపక్షంగా కూడా నిలవలేని కాంగ్రెస్ దేశంలో ప్రాంతీయ పార్టీలను నాశనం చేస్తోందని ఆక్షేపించారు. ఈ మేరకు భారాస సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.'కాంగ్రెస్ చేతగానీ, అసమర్థత కారణంగానే భాజపా మనుగడ కొనసాగుతోంది. ప్రాంతీయ



పార్టీల కృషిని విస్మరిస్తూ జాతీయ పార్టీలైన కాంగ్రెస్, భాజపాలు సిగ్గు లేకుండా విమర్శలు చేస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం ఘోర ఓటమి మిగతా 2లో..

## ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మలేదు

- మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలపై హరీశ్ రావు

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 23:

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలపై ఎక్స్ వేదికగా హరీశ్ రావు తొలిసారి స్పందించారు. తెలంగాణ ప్రజలు ముంబయి, షోలాపూర్, పూణే, నాందేడ్ వంటి ప్రాంతాల్లో అత్యధికంగా నివసిస్తున్నారని, కాంగ్రెస్ మోసాలు విరివిగా మహారాష్ట్రలో ప్రచారం అయ్యాయని హరీశ్ రావు అన్నారు. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న తెలంగాణ వాసులు కాంగ్రెస్ అబద్ధపు హామీలపై అక్కడ మిగతా 2లో..



# హైదరాబాద్ తాగునీటి అవసరాలపై దృష్టి

(మొదటి పేజీ తరువాయి..)

వెళ్లేలా కార్యచరణ రూపొందించాలన్న సీఎం అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమీక్షలో మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ సెక్రటరీ ప్రశాంత్ జె. పాటిల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**రైతులకు అవగాహన కలిగించేలా సదస్సు**

రాష్ట్రంలోని రైతులందరూ మహబూబ్‌నగర్లో ఏర్పాటు చేసే సదస్సులో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సభను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. మహబూబ్ నగర్ రైతుల సభను బహిరంగ సభలా కాకుండా.. రైతులకు అవగాహన కల్పించే సదస్సుగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజా ప్రభుత్వ విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 30న మహబూబ్ నగర్ లో జరుగనున్న రైతు సదస్సు పైన ఈ సమావేశంలో



ప్రధానంగా చర్చించారు. ముఖ్యమంత్రితో పాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సమావేశంలో పాల్గొన్నారు. యవసాయంలో వచ్చిన అధునాతన సాగు పద్ధతులు, మెళకువలను రైతులకు తెలియజేసేలా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖల అధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాట్లు చేయాలని సూచించారు. యూనివర్సిటీ అభివృద్ధి చేసిన కొత్త వంగడాలు, ఆయిల్ ఫామ్ కంపెనీల నూతన ఆవిష్కరణలు, రైతులకు ఉపయోగపడేందుకు అందుబాటులోకి వచ్చిన వివిధ కంపెనీ వినూత్న ఉత్పాదనలన్నీ ఇక్కడ స్టాళ్లల్లో ఉంచాలని సీఎం సూచించారు. అధునాతన పరికరాలు, ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, డ్రోన్లు.. అన్నింటినీ అక్కడ ప్రయోగాత్మక ప్రదర్శనకు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. రైతులందరూ 30న జరిగే సభకు అప్పటికప్పుడు వచ్చి వెళ్లే విధంగా కాకుండా రైతులకు అవగాహన కల్పించేలా మూడు రోజుల పాటు మహబూబ్ నగర్ రైతు సదస్సు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. 28వ తేదీ నుంచే ఈ స్టాళ్లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. దీంతో రాష్ట్రంలోని రైతులు దేశంలో వ్యవసాయ సాగు విధానాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకునేలా ఈ సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం 23 లక్షల మంది రైతులకు ఇప్పటికే రూ.2 లక్షల రుణమాఫీ జరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కొన్ని చోట్ల ఆధార్ నెంబర్ల తప్పులు, బ్యాంకు ఖాతాల్లో పేర్ల తప్పులు, కుటుంబాల నిర్ధారణ కారణాలతో కొందరికి రుణమాఫీ జరగ లేదని వచ్చిన ఫిర్యాదులపై అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నివేదికను అందించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి. సీఎంవో స్పెషల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# రెండు రాష్ట్రాల్లోనూ అధికారం యధాతథం

(మొదటి పేజీ తరువాయి..)

ఫడణవీస్ ఆధిక్యంలో ఉన్నారు. బారామతిలో ఎన్సీపీ అభ్యర్థి అజిత్ పవార్ ముందంజలో కొనసాగుతున్నారు. వర్లీలో శివసేన (యూబీటీ) అభ్యర్థి ఆదిత్య ఠాక్రే ఆధిక్యంలో ఉన్నారు. కోప్రిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే ముందంజలో కొనసాగుతున్నారు. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల సరళి ప్రకారం.. మహారాష్ట్రలో మహాయుతి కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సీట్లను దక్కించుకుని భారీ మెజార్టీ దిశగా సాగుతోంది. ప్రస్తుతం ఈ కూటమి 153 స్థానాల్లో గెలిచి, మరో 75 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. అటు ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమి 30 స్థానాల్లో విజయం సాధించి, 24 స్థానాల్లో ముందంజలో ఉంది. మహారాష్ట్రలో మొత్తం 288 శాసనసభ స్థానాలుండగా.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు 145 ఎమ్మెల్యేలు అవసరం. ఝార్ఖండ్‌లో జేఎంఎం కూటమి 32 స్థానాల్లో విజయం సాధించి మరో 24 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. అటు భాజపా నేతృత్వంలోని కూటమి 16 స్థానాల్లో గెలిచి, 8



స్థానాల్లో ముందంజలో ఉంది. ఈ రాష్ట్రంలో మొత్తం 81 అసెంబ్లీ స్థానాలుండగా.. మ్యాజిక్ ఫిగర్ 41.బర్‌హైత్‌లో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ఆధిక్యంలో కొనసాగుతున్నారు. గండేలో ఆయన భార్య కల్పనా సోరెన్ ముందంజలో ఉన్నారు. జార్ఖండ్ ఎన్నికల తుది ఫలితాలు రాత్రికి తర్వాత వెల్లడి కానున్నాయి. అయితే ఎన్నికల కమిషన్ ట్రెండ్స్ ప్రకారం జార్ఖండ్‌లో భారత కూటమి మెజారిటీ సాధిస్తుందని తెలుస్తోంది. ట్రెండ్స్ ప్రకారం జార్ఖండ్‌లో మరోసారి హేమంత్ సోరెన్ ప్రభుత్వం ఏర్పాటు కానుంది. తాజా సమాచారం ప్రకారం జార్ఖండ్‌లో ఇండియా అలయన్స్ 50 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఎన్డీయే 29 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. మిగిలిన 2 స్థానాల్లో ఇతరులు ఆధిక్యంలో ఉన్నారు. ఇప్పుడు పరిస్థితి చూస్తే ఈసారి కూడా జార్ఖండ్‌లో మరోసారి హేమంత్ సోరెన్ గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. జార్ఖండ్‌లోని 81 అసెంబ్లీ స్థానాలకు ఓట్ల లెక్కింపు జరుగుతోంది. తొలుత పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కించి, కొంత సమయం తర్వాత ఈవీఎం యంత్రాల ఓట్ల లెక్కింపు పక్రియ చేపట్టారు. మొదటి పోకడలు ఇప్పుడే ఉద్భవించడం ప్రారంభించాయి. క్రమంగా ఫలితాలపై స్పష్టత వస్తుంది. జార్ఖండ్‌లో 13 నుంచి 27 రౌండ్ల వరకు ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈసారి ఇద్దరు ముఖ్యమంత్రులు, మాజీ ఉపముఖ్యమంత్రులు ఎన్నికల పోరులో ఉన్నారు. ఒకవైపు భారత కూటమి, మరోవైపు ఎన్డీయే ఉంది. జార్ఖండ్‌లో 24 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయానికి బ్రేక్‌పడింది. హేమంత్ సోరెన్ ట్రెండ్స్‌లో పునరాగమనం చేస్తున్నాడు. నిజానికి 24 ఏళ్ల జార్ఖండ్ చరిత్రలో ఏ పార్టీ కూడా వరుసగా రెండోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఎప్పుడూ జరగలేదు. అయితే ఈసారి మాత్రం ఆ ట్రెండ్ మారే విధంగా అనిపిస్తోంది. కాగా ఎన్డీయే తరఫున బీజేపీ 81 స్థానాలకు గాను 68 స్థానాల్లో, ఏజేఎస్‌యూ 10 స్థానాల్లో తమ అభ్యర్థులను నిలబెట్టాయి. జేడీయూకు రెండు సీట్లు, చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన ఎల్‌జేపీ-రామ్‌విలాస్‌కు ఒక సీటు ఇచ్చారు. 2019 ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసి 79 మంది అభ్యర్థులను నిలబెట్టగా, ఎఫ÷ూజ 53 మంది అభ్యర్థులను ప్రకటించింది.

# ప్రాంతీయ పార్టీలే బలమైన పునాదులు

(మొదటి పేజీ తరువాయి..)

నుంచి కాంగ్రెస్‌ను కాపాడలేకపోయింది. ఆయన అసత్య ప్రచారాన్ని మరాఠా ప్రజలు నమ్మలేదు. ఇకనైనా తెలంగాణలో గెలిపించిన ప్రజల కోసం, వాళ్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చటం కోసం రేవంత్ పనిచేయాలి. ఏడాది క్రితం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుపై దృష్టి పెట్టాలి. ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయాలనే కుట్రలో కాంగ్రెస్ ఎక్కువ కాదు.. భాజపా తక్కువ కాదు'అని కేటీఆర్ పేర్కొన్నారు.

**రైతులు పక్షాన పోరాటానికి జైలు**

బలహీనవర్గాల రైతుల తరఫున పోరాటం చేసిన పాపానికి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి జైల్లో గడపాల్సి వస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. చర్లపల్లి జైలులో ఉన్న నరేందర్‌రెడ్డితో ములాఖత్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. '30 మంది అమాయక రైతులను జైల్లో పెట్టారు.. వాళ్ల కోసం పోరాటం చేయండి. ఫార్మా విలేజ్‌ను ప్రజలపై రుద్దుతున్నారని.. అక్కడి పేదల పక్షాన పోరాడాలని ములాఖత్ సందర్భంగా పట్నం నరేందర్‌రెడ్డి చెప్పారు. భూములు ఇవ్వం అన్నందుకు.. కాంగ్రెస్ కార్యకర్తలు ఇష్టం వచ్చినట్టు అరాచకాలు చేస్తున్నారు. కొడంగల్‌లో సర్పంచ్‌గా పనిచేసిన వ్యక్తి.. కాంగ్రెస్ పాలనలో అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన ఇంటికి అడ్డంగా గోడ కట్టి దారి లేకుండా చేస్తే అవమానం భరించలేక క్షోభతో బలవన్మరణానికి పాల్పడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి చక్రవర్తి, నియంత కాదు. సొంత నియోజకవర్గమైతే అదేమైనా మీ సామ్రాజ్యమా ?నాడు శిశు పాలుని పాపాలు లెక్క పెట్టినట్టు.. నేడు రేవంత్ పాపాలను ప్రజలు లెక్క పెడుతున్నారు. భూ కుంభకోణాలు, ఫార్మా విలేజ్ పేరిట దౌర్జన్యాలు చేస్తున్నారు. తమ భూములను ప్రభుత్వం దౌర్జన్యంగా గుంజుకుంటే ఇవ్వబోమన్న ఒకే ఒక్క మాటకి.. 30 మందికి పైగా రైతులు జైళ్లలో మగ్గుతున్నారు. వారి కుటుంబాలకు మేం ఒక్కటే చెబుతున్నాం.. మీరు భయపడాల్సిన అవసరం లేదు.. మీ వెనక కేసీఆర్ ఉన్నారు. తప్పకుండా న్యాయం, ధర్మం గెలుస్తుంది. రేవంత్ రెడ్డికి రాజకీయ భవిష్యత్తు లేకుండా గుణపాఠం చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# వయనాడ్‌లో ప్రియాంక భారీ విజయం



(మొదటి పేజీ తరువాయి..)

ప్రియాంక దాటేశారు. వయనాడ్‌లో 2019 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ నేత పీపీ సునీర్‌పై 4.3 లక్షల మెజార్టీతో రాహుల్ గాంధీ విజయం సాధించారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి పోటీ చేసిన రాహుల్ గాంధీ.. సీపీఐ నాయకురాలు అన్నీ రాజాపై 3.64 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాయ్‌బరేలీలోనూ విజయం సాధించడంతో ఆ తర్వాత ఈ స్థానాన్ని వదులుకున్నారు. దీంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. అనంతరం ప్రియాంక రంగంలోకి దిగారు. ఝార్ఖండ్ తొలి విడత ఎన్నికలతో పాటుగా నవంబర్ 13న ఈ స్థానంలో పోలింగ్ జరిగింది. వయనాడ్ ఉప ఎన్నికల్లో యూడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రియాంక గాంధీ రికార్డు మెజారిటీతో ప్రభంజనం సృష్టించారు. 2024 ఎన్నికల్లో రాహుల్ గాంధీ పేరిట నమోదైన మెజారిటీ రికార్డును ప్రియాంక బద్ధలు కొట్టారు. శనివారం మధ్యాహ్నం వయనాడ్‌లో ప్రియాంక గాంధీ మెజారిటీ 3 లక్షల 77 వేల 517 ఓట్లు దాటింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీకి వయనాడ్‌లో 3,64,422 ఓట్ల మెజారిటీ దక్కింది. ఈ రికార్డును బద్ధలు కొట్టి అన్న మెజారిటీ రికార్డును తిరగరాసిన చెల్లిగా ప్రియాంక గాంధీ నిలిచింది. అన్ని రౌండ్ల కౌంటింగ్ పూర్తయ్యే సమయానికి వయనాడ్‌లో ప్రియాంక గాంధీకి 4 లక్షల మెజారిటీ దక్కొచ్చనే అంచనాలున్నాయి. వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీకి ప్రజలు రికార్డు స్థాయిలో విజయాన్ని అందిస్తారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈమేరకు శనివారం రేవంత్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. వయనాడ్ ప్రజలు ఆమెకు రికార్డు స్థాయి విజయాన్ని అందిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఘన విజయంతో తొలిసారిగా ప్రియాంక గాంధీ పార్లమెంటులో అడుగుపెట్టబోతున్నారని హర్షాన్ని వ్యక్తం చేశారు.

# ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మలేదు

(మొదటి పేజీ తరువాయి..)

ప్రచారం చేశారని చెప్పారు. అందుకే కాంగ్రెస్ పార్టీ ఘోర ఓటమిని చవిచూసిందని హరీశ్ రావు చెప్పుకొచ్చారు.ఐదు గ్యారంటీల పేరిట కాంగ్రెస్ చేసిన గారడీని ఆ రాష్ట్ర ప్రజలు నమ్మలేదని ఆయన ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ మోసాలను మహారాష్ట్ర ప్రజలు గుర్తించారని ఈ ఎన్నికల ద్వారా తేలిందని మాజీ మంత్రి అన్నారు. తెలంగాణలో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని హరీశ్ రావు అన్నారు. ఇక్కడ పథకాలు అమలు చేయకుండా మహారాష్ట్రలో రూ.3వేలు ఇస్తామనడాన్ని ఆ రాష్ట్ర ప్రజలు గమనించారని ఆయన చెప్పుకొచ్చారు. రైతు భరోసా ఎగ్గొట్టారని, ఆసరా ఫించన్లను సైతం పక్కన పెట్టేశారని ఆయన చెప్పారు. రైతు రుణమాఫీ ఏడాది గడుస్తున్నా పూర్తి చేయకపోవడం వంటి అంశాలను మహా ప్రజలు గమనించారని ఆయన తెలిపారు. ఈ అంశాలన్నీ మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్‌పై తీవ్ర ప్రభావం చూపెట్టాయని హరీశ్ రావు అన్నారు. అలాగే జార్ఖండ్ ఎన్నికలపైనా మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌పై బీజేపీ పార్టీ అక్రమ కేసులు పెట్టిందని, ఆయన్ని అరెస్టు చేసిందని హరీశ్ రావు మండిపడ్డారు. అలాగే హేమంత్ సోరెన్ పార్టీని సైతం చీల్చేందుకు కుట్రలు చేసిందని ధ్వజమెత్తారు. దీన్ని గమనించిన జార్ఖండ్ ప్రజలు ఎన్నికల్లో బీజేపీని ఓడించారని ఆయన చెప్పారు. బీజేపీ కక్షసాధింపు విధానాలని ప్రజలు హర్షించడం లేదని తేలిపోయిందని అన్నారు. విజయం సాధించిన హేమంత్ సోరెన్‌కు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు హరీశ్ రావు చెప్పారు.

# ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీ తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి..)

ఈ సందర్భంగా ఇటీవల ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం ఝాన్సీలోని మహారాణి లక్ష్మీబాయి మెడికల్ కాలేజీ అగ్నిప్రమాదంపై రాజనర్సింహ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ ప్రమాదంలో 10మంది చిన్నారులు మృతిచెందడంపై మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజనర్సింహ అధికారులను అప్రమత్తం చేశారు. ఇలాంటి ఘటనలు తెలంగాణలో చోటు చేసుకోకుండా చూడాలని, అందుకు ముందుగానే అన్ని ఆస్పత్రుల్లో ్గ÷ర్ సేఫ్టీపై తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. తనిఖీల కోసం వెంటనే పది బృందాలను ఏర్పాటు చేయాలని సూచనలు జారీ చేశారు. తొలుత గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, ఎంజీఎం వంటి పెద్దపెద్ద ఆస్పత్రుల్లో తనిఖీలు చేసి నివేదికలు తనకు అందించాలని మంత్రి రాజనర్సింహ తెలిపారు. ప్రతీ ఆస్పత్రిలో ఫైర్ అలార్మ్, స్మోక్ డిటెక్టర్స్ ఉన్నాయా లేవా అనేది పరిశీలించాలని అధికారులకు మంత్రి చెప్పారు. ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదాలు సంభవించి మంటలు ఏర్పడితే ఆర్పే యంత్రాలు సరిపడా ఉన్నాయో, లేవో? చూడాలని.. వాటి తుది గడువు తేదీలను సైతం చెక్ చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే మంటలు ఆర్పే యంత్రాల వినియోగంపై ఆస్పత్రి సిబ్బంది, సెక్యూరిటీకి శిక్షణ ఇవ్వాలని చెప్పారు. ఆరోగ్య కేంద్రాల్లో పవర్ సప్లై సిస్టమ్‌ను సైతం పరిశీలించాలని సూచించారు. ఆస్పత్రి భవనంలో పాత ఎలక్ట్రిక్ వైర్లు ఉంటే వాటి స్థానంలో నాణ్యమైన కొత్త కేబుల్స్ ఏర్పాటు చేయాలని మంత్రి సుస్పష్ట ఆదేశాలు జారీ చేశారు. రోవైప్న ÷ర్ సేఫ్టీ, షార్ట్ సర్క్యూట్‌కు సంబంధించి చేయాల్సిన, చేయకూడని పనుల గురించి సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని మంత్రి చెప్పారు. సమీపంలోని అగ్నిమాపక శాఖ సిబ్బందితో ఆస్పత్రి అధికారులు సంబంధాలు కలగి ఉండాలని తెలిపారు. ఆస్పత్రి భవనాల్లో తరచుగా ్గ÷ర్ సేఫ్టీ మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని అధికారులకు రాజనర్సింహ చెప్పారు. అగ్నిప్రమాదాలు సంభవిస్తే సురక్షితంగా బయటకు వచ్చేందుకు భవనం ఎ÷-లాన్‌కు సంబంధించిన సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు.

# వ్యూహాత్మకంగా బిజెపి ఎత్తులు

**ముంబై, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 23:**

పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే సర్కారుకు షాకిచ్చిన మహారాష్ట్ర ఆరు నెలలు తిరగక ముందే మళ్లీ అక్కున చేర్చుకుంది. అక్కడ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కూటమి బలంగా పుంజుకొంది. విజయమే పరమావధిగా 'మహాయుతి' ప్రదర్శించిన శక్తి'యుక్తు'లు కూటమికి విజయాన్ని కట్టబెట్టాయి. మహాయుతిలో ఓట్ల బదలాయింపు సజావుగా సాగినట్లు ఫలితాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు మహావికాస్ అఘాడీలో సీట్ల సర్దుబాటు వేళ తలెత్తిన విభేదాలు ఎన్నికలపై ప్రతికూల ప్రభావం చూపాయి. కాంగ్రెస్ నిర్ణయాలకు దిల్లీ అనుమతులుండాలంటూ సంజయ్ రౌత్ విమర్శించడం, దీనికి హస్తం నేత నానా పటోలే స్పందన వంటివి ఇరు పార్టీల ఓటర్లను ఏకం కాకుండా చేశాయి. అఘాడీ కూటమిని నష్టపర్చాయి. ముఖ్యంగా మహిళ, ఓబీసీ, రైతుల అండతో బిజెపి కూటమి అధికారాన్ని నిలుపుకొంది. లోక్‌సభ ఎన్నికల్లో వ్యతిరేకతను అధిగమించి మరోసారి అధికారం చేపట్టబోతోంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా నేతృత్వంలోని మహాయుతి సర్కారు పట్టు నిలుపుకొంది. 2019 నుంచి ముగ్గురు ముఖ్యమంత్రులు, నలుగురు డిప్యూటీ సీఎంలను చూసిన ఈ రాష్ట్ర ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. ఓబీసీ ఓట్ల సమీకరణ, ఆకర్షణీయమైన పథకాలు, మహిళల ఓట్లు విజయంలో కీలక భూమిక పోషించాయి. భాజపా, శివసేన శిందే, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ.. ఇలా మూడు పార్టీలు మెరుగైన ప్రదర్శన చేయడం కూటమి విజయానికి దోహదం చేశాయి. ఈసారి ప్రధాన పార్టీలైన భాజపా- కాంగ్రెస్ 76 సీట్లలో ముఖాముఖి తలపడ్డాయి. గత కొన్నేళ్లుగా పలుచోట్ల జరిగిన ఇలాంటి పోరులో హస్తం పార్టీ పక్షాన సానుకూల ఫలితాలు వచ్చిన సందర్భాలు అతి తక్కువ. ఈసారి ఫలితాలను జాగ్రత్తగా గమనిస్తే.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 44 సీట్లను గెలుచుకోగా.. ఈసారి ఆ సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఆ మేరకు భాజపాకు సీట్ల సంఖ్యలో పెరుగుదల కనిపించింది. మహారాష్ట్ర రాజకీయాల్లో 11 జిల్లాలున్న విదర్భలో విజయాన్ని అధికారానికి ద్వారంగా భావిస్తారు. ఇక్కడ 62 స్థానాలున్నాయి. కొన్నేళ్లుగా ఇక్కడ భాజపా ఆధిక్యాన్ని ప్రదర్శిస్తోంది. కానీ, 2019లో కొంత మెజార్టీ తగ్గింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇక్కడ భాజపా తీవ్రంగా దెబ్బతింది. ఫలితంగా మహావికాస్ అఘాఢీ 10 మంది ఎంపీలను దక్కించుకొంది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లోనూ తమదే హవా అనుకుంది. కానీ ప్రచారం మొదలయ్యాక, ఎన్నికల దగ్గర పడ్డాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ముఖాముఖి తలపడ్డ స్థానాల్లో దాదాపు 40 సీట్లలో మహాయుతి విజయం సాధించింది. ఈ ప్రాంతం వ్యవసాయాధారితమైంది. పత్తి, సోయాబీన్ ప్రధాన పంటలు. కాంగ్రెస్ ఇక్కడి వారిని ఆకట్టుకొనేందుకు చేసిన ప్రచారం అంతగా ఫలితం చూపలేదు. సోయా రైతులకు రూ.7,000 మద్దతు ధర ఇస్తామని చెప్పినా ఫలితం రాలేదు. విదర్భ ప్రాంతంలోని నాగ్‌పుర్‌లో ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉంది. ఆ సంస్థ ప్రభావం అక్కడా, ఆ చుట్టుపక్కల ప్రాంతాలపై బలంగా పనిచేసింది. గత ఎన్నికల్లో కమలం విషయంలో ఆర్ఎస్ఎస్ కాస్త కినుక వహించిందన్న ప్రచారం జరిగింది. ఈసారి మాత్రం వారి మద్దతు మహాయుతికి బాగా లభించినట్లు చెబుతున్నారు.ఈ ఎన్నికలను అత్యధికంగా ఓబీసీ సమీకరణ ప్రభావితం చేసిన అంశంగా చూడాలి. కీలకమైన మరాఠా ఓటర్లు మహావికాస్ అఘాడీలోని కాంగ్రెస్ వైపు కొంత మొగ్గు చూపుతున్నట్లు గ్రహించిన కమల బృందం తన వ్యూహానికి పదును పెట్టింది. మరాఠా వంటి బలమైన వర్గం కాకుండా ఉన్న ఇతరత్రా వర్గాలన్నింటినీ భాజపా ఏకీకృతం చేసింది. ముఖ్యంగా ఓబీసీ ఓట్ల పైనే ప్రధానంగా దృష్టి పెట్టింది. భాజపా ఈ రాష్ట్రంలో 90ల నుంచే వీరిని తమ వైపు ఆకర్షించడానికి యత్నాలు మొదలుపెట్టింది. ముఖ్యంగా మాలి, ధంగర్, వంజరి వర్గాలు కమలనాథులకు అండగా ఉన్నాయి. మరాఠాలకు ఓబీసీ రిజర్వేషన్లు ప్రకటిస్తే తమ వాటా తగ్గుతుందని చాలా జాతుల్లో భయాలున్నాయి. వాటిని కమలం పార్టీ ఓట్లుగా మలుచుకుంది. మరోవైపు మహావికాస్ అఘాడీ మాత్రం పూర్తిగా మరాఠా రిజర్వేషన్ల అంశంపైనే ఆధారపడింది. అధికారంలోకి వస్తే వారికి రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. చిత్రం ఏంటంటే, మరాఠా వర్గానికి ఏక్‌నాథ్ శిందే అక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నారు. 'మహాయుతి' ముఖ్య నేతగా పేరొందారు. దాంతో మహావికాస్ అఘాడీ ఆశించిన స్థాయిలో పెద్ద ఎత్తున మరాఠా ఓట్లు వాళ్లకి పడలేదు. రాష్ట్రంలోని మహిళా ఓట్లను 'లడ్కీ బెహన్ పథకం' కూడగట్టింది. రూ.1,500 నేరుగా వారి ఖాతాల్లో వేయడంతో లబ్ధిదారులు 'మహాయుతి' వైపు నిలిచారు. ఈసారి ఆ మొత్తాన్ని రూ.2,100 చేస్తామని కూటమి హామీ ఇచ్చింది. కాంగ్రెస్ పోటీగా రూ.3,000 ఇస్తామని పేర్కొంది. అయినా ఓటర్లు భాజపా కూటమికే పట్టం కట్టారు. ఈ పథకం వల్ల అత్యధిక ప్రయోజనం పొందిన పుణె, థానే, నాసిక్, నాగ్‌పూర్, షోలాపూర్ జిల్లాల్లో మహిళల ఓటింగ్ పోటెత్తడం భాజపాకు బాగా కలిసొచ్చింది. మహాయుతి కూటమి రైతులకు ఇప్పటికే కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద ఇస్తున్న రూ.12,000లని రూ.15,000కు పెంచుతామని హామీ ఇచ్చింది. దీంతోపాటు కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)కు అనుబంధంగా రేట్లలో తేడాను 20శాతం వరకు కవర్ చేసేలా ధరల మద్దతు పథకాన్ని తెస్తామని హామీ ఇచ్చింది. బీద రైతులకు మేలు జరిగేలా అక్షయ అన్నయోజన స్కీమ్‌ను ప్రవేశపెడతామంది. దీనిలో బియ్యం, జొన్నలు, శనగ నూనె, ఉప్పు, పంచదార, పసుపు, ఆవాలు, కారం వంటివి ప్రతినెలా ఇస్తామని పేర్కొంది. వీటితో పాటూ నదుల మళ్లింపు చేపట్టి పొలాలకు నీరు అందిస్తామని ప్రకటించింది. ఇవన్నీ అన్నదాతలను ప్రభావితం చేశాయి. మహారాష్ట్రలో ఉల్లిని ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంటారు. ఉల్లిపై ఆంక్షలు విధించడంపై కొంతకాలంగా ఉల్లి రైతులు గుర్రుగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా కూటమిపై ఆ ప్రభావం పడింది. ముఖ్యంగా నాసిక్ ప్రాంతంలో తాము ఉల్లి రైతుల ఆగ్రహాన్ని చవిచూసినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే స్వయంగా ఓ సందర్భంలో వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఉల్లి ఎగుమతులపై ఆంక్షలు తొలగించడం గమనార్హం. కమల కూటమిపై రైతుల్లో ఉన్న అసంతృప్తిని ఈ చర్యతో చల్లార్చగలిగారు.

# ప్రజలంతా ప్రధాని మోడీ వెంటే

**ముంబై, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 23:**

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార 'మహాయుతి'కూటమి అద్భుత విజయం సాధించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను సైతం అందని రీతిలో సీట్లు సాధించి సునామీ సృష్టించింది. ఈ అఖండ విజయంపై భాజపా సీనియర్ నేత, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. ప్రజలంతా నరేంద్ర మోదీ వెంటే నిలిచారనడానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఇలాంటి భారీ విజయం సాధించడంలో సహకరించిన మహిళలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనేక తప్పుడు ఆరోపణలు, బూటకపు కథనాలను ప్రచారం చేయడం, మతం ఆధారంగా ఓటర్లను వేరు చేయడం వంటి విపక్ష పార్టీల ప్రయత్నాలను జనం విఫలం చేశారన్నారు. తమ కూటమి విజయంపై ముంబయిలో విలేకర్లతో మాట్లాడారు. మహారాష్ట్ర ఓటర్లు, పార్టీ శ్రేణులు, నేతల మద్దతు వల్లే విపక్షాల 'చక్రవ్యూహం'ను విచ్ఛిన్నం చేయడంలో తాను విజయవంతమయ్యానన్నారు. ముఖ్యమంత్రి పదవి విషయంలో ఎలాంటి వివాదం లేదని.. తదుపరి సీఎం ఎవరనే విషయంపై 'మహాయుతి' నేతలు నిర్ణయిస్తారని ఫడణవీస్ స్పష్టం చేశారు. సీఎం ఏక్‌నాథ్ శిందే సారథ్యంలోని పార్టీనే బాలాసాహెబ్ ఠాక్రే నిజమైన శివసేన అని ప్రజలే చూపించారన్నారు. ఇది భాజపా విజయమన్న ఫడణవీస్.. ఇందులో తన పాత్ర చాలా చిన్నదేనని వ్యాఖ్యానించారు.

# యువ శక్తి అభేద్యం

## ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో

## 'మహార్ణవ ఘోష' (కవితా సంకలనం) పుస్తకావిష్కరణ

## గురువు అట్లూరి వెంకటరమణపై అపార అభిమానం, గౌరవాన్ని చాటుకున్న శిష్యబృందాలు




**నేటి ఫోకస్ న్యూస్, ఖమ్మంరూరల్-నవంబర్ 23:**

భరతజాతి గమనాన్ని మార్చే అర్ధవంతమైన ఆలోచనలు, విద్యా తృష్ణ, దేశాభివృద్ధిలో పాలుపంచుకునే తీరు,ప్రతి అంశంపై అవగాహన దేశ భవిష్యత్ పై ఖచ్చిత నిర్ణయాలు వివిధ రంగాలలో నెలకొన్న విభిన్న పరిస్థితులు, అసహనం, అంతులేని నిర్లక్ష్యం,ఓటు బ్యాంకు రాజకీయాలు విద్యా వ్యవస్థను కుదిపేస్తున్న తరుణంలో యువతలోని ధర్మాగ్రహాన్ని సమాజం ముందు ప్రకటించటానికి వాహకమే ఈ మహార్ణవ ఘోష.. పాఠశాల,కళాశాల,విశ్వ విద్యాలయ స్థాయిలో పాఠ్య ప్రణాళికలు,విద్యార్థుల భవిష్యత్ ఉపాధి అవకాశాల కల్పనపై ఖచ్చితమైన నిర్ణయాలను తీసుకోవాల్సిన బాధ్యత ,రాబోయే రోజులలో విద్యా రంగానికి దిక్సూచిగా యువత నిలబడాలనే ఆకాంక్ష వెలిబుచ్చిన కవితలు ఇందులో ప్రధానంగా ఉన్నాయి. స్వాతంత్ర్య ఉద్యమ కాలం,సమర యోధులు,బ్రిటీషు వారి చేతిలో ఎదుర్కొన్న దయనీయ పరిస్థితులను కళ్ళకు కట్టిన కవితలు, స్వాతంత్ర్యానంతర భారతదేశంలో వివిధ రంగాల స్థితిగతులే ఆధారంగా రచించిన కవితలు ఆలోచింపజేస్తున్నాయి. నేటి విద్యావ్యవస్థ,విద్యార్థులలోని అపసవ్య ధోరణులు,తల్లిదండ్రుల బాధ్యత,పాఠశాల విద్యలో రావలసిన మార్పులు,బాల్యంపై కమ్ముకున్న విషాద ఛాయలపై రణభేరి మ్రోగించిన కవితలు. రైతు పడే కష్టం,కర్షకుల శ్రమ,వాతావరణ మార్పుల నేపథ్యంలో వారి జీవన వైచిత్రి ఇలా ప్రతి అంశంపై అట్లూరి.వెంకటరమణ సాగించిన కవన క్రతువు సమాహారమే ఈ "మహార్ణవ ఘోష". ఇటువంటి సుస్పష్ట, నిఖార్సైన రచనలు సుదీర్ఘ అధ్యాపక అనుభవం ఉన్న వ్యక్తి నుండి రావటం సముచితమని ప్రియదర్శిని విద్యాసంస్థల అధినేత డాక్టర్ కాటేపల్లి.నవీన్ బాబు పుస్తకావిష్కరణ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, శాఖాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం,విద్యార్థినులు పాల్గొన్నారు.






# తాత్కాలికంగా విధుల నిష్క్రమణ విరమించిన న్యాయవాదులు

**తొర్రూర్, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 23:**




శుక్రవారం హైకోర్టులో జరిగిన సమావేశంలో కొంతకాలంగా కోర్టు లో ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని బార్ కౌన్సిల్ అఫ్ తెలంగాణ చైర్మన్ ఎల్ నరసింహారెడ్డి, పోర్ట్ పోలియో జడ్జి తదితర న్యాధికారుల హామీ మేరకు శనివారం తొర్రూర్ బార్ అసోసియేషన్ హాల్ లో జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించి సభ్యుల అభిప్రాయం మేరకు కక్షి దారుల ఇబ్బందుల దృష్ట్యా తాత్కాలికంగా విధులనిష్క్రమణ విరమించి తాత్కాలిక విధుల పునః హాజరుకు అంగీకరించారు. ఈ సమావేశంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ విష్ణువర్ధన్ రెడ్డి, తొర్రూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కలువకొలను ప్రవీణ్ రాజు, జనరల్ సెక్రటరీ ఆర్కే ఘనపురం సీనియర్ న్యాయవాదులు బండపల్లి వెంకన్న, పొడకంటి యాకాంబరం, ముకుందరావు, వల్లపు మధుసూధన్, మహేష్, వెంకటరత్నం,రఘురామ్ రెడ్డి, అశోక్, సైదులు, లింగాల శ్రీనువెంకటేశ్వర్లు, విజయ, కృపావతి, నగెష్, గంపల ప్రవీణ్, శ్రీధర్, గౌస్, అనిల్, యాకేందర్ క్లర్కులు, తదితరులు పాల్గొన్నారు.



# సమాజంలో మహోన్నతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి

### ఎస్ఎస్సిలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలి

### పాఠశాలలలో విద్యార్థులకు అత్యుత్తమమైన బోధనలు అందించాలి వారి అభ్యసన స్థాయిలు మెరుగు పడే విధంగా అందరూ కృషిచేయాలి

### మధ్యాహ్న భోజనం, సానిటేషన్, తాగునీరు, విద్యుత్ సరఫరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



**మహబూబాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-నవంబర్ 23:**

సమాజంలో మహోన్నతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని, ఎస్ ఎస్ సి పరీక్షల్లో జిల్లాను రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం ఉండేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, పాఠశాలలు ,వసతి గృహాలలో రుచికరమైన మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, నిరంతర విద్యుత్ సదుపాయం, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థినీ విద్యార్థులకు విద్యా బోధనలు అందించాలని అదే విధంగా వారిని దత్తత తీసుకొని వారి అభ్యసన స్థాయిలను మెరుగు పడే%శీ%దుకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవీందర్ రెడ్డి,తో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని విద్యాసంస్థలలో అత్యుత్తమమైన బోధనలు అందించడానికి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి సబ్జెక్టుల వారిగా అర్థమయ్యే రీతిలో బోధించాలని, విద్యార్థి యొక్క చదువు, వ్యక్తిగత విషయాలపై దృష్టి పెట్టాలని, వారి హాజరు శాతాన్ని వంద శాతం వచ్చే వరకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని ,వారి యొక్క మేధస్సును వెలికి తీసేందుకు నూతన ఆవిష్కరణలకు వారిని ప్రేరేపించాలని, ప్రతి సబ్జెక్టులో పిల్లలు పట్టు సాధించేందుకు పక్కా ప్రణాళికతో ప్రధానోపాధ్యాయులు ముందుకు సాగాలన్నారు. విద్యతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక స్థితిగతులపై ప్రత్యేక తరగతులు డీయం,హేస్ఓవారి సహకారంతో నిర్వహించాలని, సూచించారు. పిల్లలు పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరయ్యేందుకు కృషి చేయాలని షెడ్యూలు ప్రకారం పేరెంట్స్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన సమయంలో రుచికరమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా వంట సిబ్బంది భోజనాలు సిద్ధం చేయాలని, స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,నిరంతరం విద్యుత్తు సదుపాయం ఉండేలా చూసుకోవాలని, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఆర్ బి ఎస్ కే క్యాంపులు నిర్వహించాలని, సూచించారు.సమాజానికి భావి భారత పౌరులను అందించే మహోన్నతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అన్నారు. మండలాల ప్రత్యేక అధికారులను అన్ని పాఠశాలలు,వసతి గృహాలలో అందిస్తున్న సేవలపై నిత్యం సమీక్షలు, తనిఖీలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ లు ప్రోగ్రాం ఆఫీసర్స్ అప్పారావు, చంద్రశేఖర్ ఆజాద్, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నీతివంతమైన పాలనకు పట్టం కట్టిన మహా ఓటర్







## సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి!



**ఫోకస్ న్యూస్ ప్రతినిధి (స్టేట్ కోఆర్డినేటర్/బామిని రఘుపతి)-నవంబర్ 23:**

మహారాష్ట్ర తో పాటు దేశంలో జరిగిన వివిధ రాష్ట్రాల ఉప ఎన్నికలలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అభ్యర్థులు అఖండ మెజార్టీతో గెలుపొందడం నరేంద్ర మోడీ అందిస్తున్న సుపరిపాలనకు ప్రత్యక్ష ఉదాహరణ.. వారంటీ లేని గ్యారెంటీలతో గారడి విద్య చేస్తున్న కాంగ్రెస్ పార్టీ గంగలో ముంచిన ఓటర్ మహాశయులు.. మోడీ నాయకత్వంలో ప్రపంచంలోనే శక్తివంతమైన భారతావని ఆవిష్కరిస్తుంది దేశ ప్రజలు విశ్వసిస్తున్నారు.. అని లిశ్రీమతి గోదావరి అంజిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో లిబిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అంజిరెడ్డి పెద్దలు పెంటా రెడ్డి దేవేందర్ రెడ్డి జైపాల్ రెడ్డి రాంబాబు భూత అధ్యక్షులు ఎస్ రాజు భారతీ నగర్ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు గీత బసమ్మ బలరాం లక్ష్మణ్ గౌడ్ రాములు యాదవ్ రఘునాథ్ రెడ్డి వీరారెడ్డి తదితరులు పాల్గొని మహా విజయం సందర్భంగా పటాకులు కాల్చుకొని మిఠాయిలు తిని సంబరాలు జరుపుకున్నారు.

# కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిసిన వేముల మారయ్య

**నేటి ఫోకస్ న్యూస్, నాచారం:**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బంజారాహిల్స్ లోని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసిన బి.ఆర్.టి.యు రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టినటువంటి ఉచిత బస్సు పథకం వల్ల రాష్ట్రంలో ఆటోడ్రైవర్లుకు ఆదాయం లేక తమ కుటుంబాన్ని పోషించలేక కొంతమంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకుంటున్నారని, అలాగే ఆటో డ్రైవర్లు పడుతున్న అనేక ఇబ్బందులపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు వేముల మారయ్య వివరించారు. రాష్ట్రంలో ఉన్న ఆటో కార్మికుల సమస్యలపై స్పందించాలని కవితను కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# నీటి కష్టాలు తీర్చిన కంటోన్మెంట్ అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే శ్రీ గణేష్

### శాంసన్ రాజు ఆధ్వర్యంలో 2వ వార్డు మహిళల శ్రీ గణేష్ కు ఆత్మీయ సన్మానం

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్-నవంబర్ 23:**





సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న నీటి సమస్యను, ఎమ్మెల్యే శ్రీ గణేష్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సత్వరమే సమస్యను పరిష్కరించేలా కృషి చేసినందుకు, 2వ వార్డు మహిళలు ఆత్మీయ సన్మానం చేశారని, రెండో వార్డు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్యాంసన్ రాజు అన్నారు. శనివారం నాడు శ్యాంసన్ రాజు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకొని ఎమ్మెల్యే శ్రీ గణేష్ కు పుష్పగుచ్ఛం అందజేసి పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్యాంసన్ రాజు మాట్లాడుతూ... కంటోన్మెంట్ కు కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధికి అనునిత్యం కృషి చేస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్ కు కంటోన్మెంట్ 2వ వార్డు మహిళలు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందాని తెలిపారు. తమ నీటి కష్టాలు తీర్చినందుకు ఎమ్మెల్యే శ్రీ గణేష్ కు నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె. యాదగిరి, ఎండి గౌస్, సంద్రపాటి నాగరాజు, అస్గర్, అన్న నగర్ మురళి, జెడి నగేష్, సరోజక్క, ముత్యాల లక్ష్మీ, రైసా బీ, ఆయిషా బేగం, మహేశ్వరి, స్వరూప, నజుమా బేగం, తదితర మహిళలు పాల్గొన్నారు.




# పుష్ప-2 నుంచి మరో సాంగ్ నేడు విడుదల

మరికొన్ని రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా పుష్ప 2 సందడి మొదలు కానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌తో పాటు పాటలు విడుదల చేయగా.. రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతున్నాయి. ఇదిలావుంటే మూవీ నుంచి ఐటం సాంగ్‌ను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. కిస్సిక్ అంటూ ఈ సాంగ్ రాబోతుండగా.. సుకుమార్, అల్లు అర్జున్ కాంబోలో వచ్చిన ఆ అంటే అమలాపురం, రింగ రింగా, ఊ అంటావా మావ సాంగ్‌లను మించి ఈ పాట ఉండబోతున్నట్లు తెలుస్తుంది. తాజాగా ఈ పాటకు సంబంధించిన ప్రోమోను మేకర్స్ విడుదల చేశారు. ఫుల్ సాంగ్‌ను నవంబర్ 24న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ తెలిపింది.


# నటలనలో అర్థశతాబ్దం పూర్తి చేసుకున్న మోహన్ బాబు

తొలినాళ్లలో ఒక్కపూట భోజనం కరువే అని భావోద్వేగం మంచు మోహన్‌బాబు నటనా ప్రయాణంలో 50వ వసంతంలోకి అడుగు పెట్టారు. 50 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పురస్కరించుకుని వచ్చే ఏడాది నవంబరు 22 వరకూ ప్రతినెలా ఓ వేడుకని నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. అందులో మోహన్‌బాబు మాట్లాడుతూ భావోద్వేగంగా మాట్లాడారు. 'నా తల్లిదండ్రులు ఆశీస్సులు, నటనలో నాకు జన్మనిచ్చిన దాసరి నారాయణరావుగారి దీవెనలు నాపై ఎప్పుడూ ఉంటాయి. సీనియర్ ఎన్టీఆర్, ఏయన్నార్, కృష్ణ, శోభన్‌బాబు ఎప్పుడూ నన్ను వారి సొంత తమ్ముడిలా భావించారు. అన్నిటికంటే ముఖ్యంగా అభిమానుల ప్రేమాభిమానాలే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చాయి. 1975 మార్చి వరకు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాను. భోజనం కూడా దొరక్క ఎన్నో రోజులు ఇబ్బందులు పడ్డాను. నేడు మీ అందరితో (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) కలిసి భోజనం చేయాలని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయమని విష్ణుని అడిగాను. 'మా' అధ్యక్షుడిగా విష్ణు ఎలా పనిచేస్తున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నాను. 'మా' బిల్డింగ్ ఆలస్యం అవుతుందేమో కానీ విష్ణు చెప్పిన మాటను కచ్చితంగా నెరవేరుస్తాడు. దేశమే గర్వించదగ్గ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు' అన్నారు. కులం కూడు పెట్టదని పెద్దలు చెబుతారు. నా కులం వాళ్లే నా సినిమా చూడమంటే ఒక్కడు చూడడు.

నాకు అందరూ సమానమే. కులమతాలతో సంబంధం లేదు. అన్ని కులాలు ఒక్కటే. అందరూ నన్ను ఆశీర్వదించాలి. ఎన్నో మంచి పనులు చేశాను. వాటిని వేదికలపై చెప్పడం నాకు నచ్చదు. చనిపోయిన నటుడి భార్యకు ఉద్యోగం ఇప్పించాను. వాళ్ల పిల్లల్ని చదివించాను. ఆ పిల్లలు కూడా హీరోలు అయ్యారని విని సంతోషించాను. ఎంతో మంది పిల్లల్ని నేను చదివించాను. ఇలాంటి మంచి పనులు ఎప్పుడూ చేస్తూనే ఉంటాను. నా సినిమాల్లోనూ ఎంతోమందికి అవకాశాలు కల్పించాను. ఎవరికైనా చదువు విషయంలో ఇబ్బందులు ఉంటే నా యూనివర్సిటీ ఉందని మర్చిపోకండి' అన్నారు. ఇక కన్నప్ప చిత్రం గురించి చెబుతూ ఇది విష్ణు కెరీర్‌లో మైలు రాయి కావాలని కోరుకుంటున్నా' అన్నారు.







# రెహమాన్ బాటలోనే మోహిని డే విడాకులు



## రెహమాన్‌తో సంబంధంపై సర్వత్రా పుకార్లు

ఆస్కార్ అవార్డ్ గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు, ఏ.ఆర్ రెహమాన్ సైరా బాను దంపతులు విడాకులు తీసుకోబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే వీరిద్దరి విడాకులు ప్రకటించిన కాసేపటికే తన భర్త నుంచి విడిపోతున్నట్లు రెహమాన్ టీమ్‌లోని బాసిస్ట్ మోహిని డే వెల్లడించారు. గత కొన్నేళ్లుగా ఆమె రెహమన్ ట్రూప్‌లో కొనసాగుతున్నారు. అయితే రెహమాన్, మోహిని డే ఒకేరోజు విడాకులు ప్రకటించడంతో ఈ ఇద్దరి మధ్య సంబంధం ఉందని అందుకే విడాకులు తీసుకోబోతున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా ఈ రూమర్స్‌పై మోహిని తన ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించింది. నేను విడాకులు ప్రకటించిన అనంతరం నుంచి మీ ఇంటర్వ్యూ కావాలని నాకు చాలా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. అయితే వీళ్లంతా ఎందుకు ఇంటర్వ్యూ చేద్దాం అనుకుంటున్నారో నాకు తెలుసు. ఈ చెత్తకు ప్రచారమివ్వాలన్న ఆసక్తి నాకు ఏమాత్రం లేదు.

ఇలాంటి రూమర్స్‌పై మాట్లాడి నా విలువైన సమయాన్ని వృథా చేసుకోలేను. దయచేసి నా వ్యక్తిగత గోప్యతను గౌరవించండి అంటూ మోహిని డే చెప్పుకోచ్చింది. మరోవైపు ఇదే విషయంపై రెహమాన్ భార్య సైరా తరఫు న్యాయవాది వందనా షా కూడా స్పందిస్తూ.. ఈ రూమార్స్‌లో ఎలాంటి నిజం లేదని క్లారిటీ ఇచ్చారు.

# భారీ స్కోర్ దిశగా భారత్!

## యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ సెంచరీలు

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్ట్‌లో టీమిండియా పట్టు బిగించింది. 46 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ నిలకడగా ఆడుతూ భారీ స్కోర్ దిశగా సాగుతోంది. భారత ఓపెనర్లు యశస్వి జైస్వాల్(193 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 90 బ్యాటింగ్), కేఎల్ రాహుల్(153 బంతుల్లో 4 ఫోర్లతో 62 బ్యాటింగ్) అసాధారణ బ్యాటింగ్‌తో చెలరేగారు.దాంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ వికెట్ నష్టపోకుండా 172 పరుగులు చేసింది. 20 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత భారత ఓపెనర్లు ఆసీస్ గడ్డపై 100 ప్లస్ రన్స్ భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. భారత బ్యాటర్ల సాధికారిక బ్యాటింగ్‌తో ఆసీస్ బౌలర్లు తేలిపోయారు. పిచ్ కూడా మారడంతో ఆసీస్ బౌలర్లకు కష్టమైంది. ఓపికగా ఆడిన భారత ఓపెనర్లు ఎలాంటి తప్పిదం చేయకుండా పరుగులు రాబట్టారు. సమన్వయంతో బ్యాటింగ్ చేసి ఆసీస్ బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు. ఈ ఓపెనింగ్ జోడీని విడదీసేందుకు ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ శతవిధాల ప్రయత్నించాడు. జట్టులో ఉన్న బౌలింగ్ ఆప్షన్స్ అన్నింటిని ఉపయోగించినా ఫలితం దక్కలేదు. చివరకు మార్నస్ లబుషేన్, ట్రావిస్ హెడ్‌తో కూడా బౌలింగ్ చేయించాడు. ప్రస్తుతం భారత్ ఆధిక్యం 218 పరుగులకు చేరింది. మూడో రోజు ఆటలో టీమిండియా రెండు సెషన్లు ఆడినా.. ఆసీస్ ముందు భారీ లక్ష్యం నమోదవుతోంది.



అంతకుముందు 67/7 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 51.2 ఓవర్లలో 104 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు మిచెల్ స్టార్క్(112 బంతుల్లో 2 ఫోర్లతో 26), అలెక్స్ క్యారీ(31 బంతుల్లో 3 ఫోర్లతో 21) టాప్ స్కోరర్లుగా నిలిచారు. రెండో రోజు వేసిన ఫస్ట్ ఓవర్‌లోనే బుమ్రా.. అలెక్స్ క్యారీని పెవిలియన్ చేర్చి ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. ఆ కాసేపటికే నాథన్ లయన్‌ను హర్షిత్ రాణా క్యాచ్ ఔట్ చేశాడు. మరోవైపు జిడ్డు బ్యాటింగ్‌తో మిచెల్ స్టార్క్ భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచాడు. అతన్ని హర్షిత్ రాణా అద్భుత బంతితో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చి ఆసీస్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.భారత బౌలర్లలో బుమ్రా(5/30) ఐదు వికెట్లు తీయగా.. అరంగేట్ర పేసర్ హర్షిత్ రాణా(3/48) మూడు వికెట్లు.. మహమ్మద్ సిరాజ్(2/20) రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 49.4 ఓవర్లలో 150 పరుగులకు కుప్పకూలింది. నితీష్ కుమార్ రెడ్డి(59 బంతుల్లో 6 ఫోర్లతు, సిక్స్‌తో 41), రిషభ్ పంత్(78 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 37), కేఎల్ రాహుల్(74 బంతుల్లో 3 ఫోర్లతో 26) టాప్ స్కోరర్లుగా నిలిచారు.

# ఆటగాళ్ల జాబితాలను సిద్ధం చేసుకున్న సన్‌రైజర్స్




ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఎల్ 2025 మెగా వేలానికి రంగం సిద్ధమైంది. మరికొద్ది గంటల్లో సౌదీ అరేబియాలోని జడ్డా వేదికగా ఈ మెగా వేలానికి తెరలేవనుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ మెగా ఆక్షన్ మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభం కానుంది. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ టైమింగ్స్ క్లాష్ కాకుండా ఐపీఎల్ నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో పాల్గొనేందుకు మొత్తం 1574 మంది ఆటగాళ్లు రిజిస్టర్ చేసుకోగా.. భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) 574 మందిని షార్ట్ లిస్ట్ చేసింది. రిటెన్షన్ ప్రక్రియ అనంతరం పది ఫ్రాంచైజీల్లోని 204 స్థానాల కోసం ఈ 574 మంది ఆటగాళ్లు పోటీపడనున్నారు. ఇప్పటికే పది ఫ్రాంచైజీలు తమ వ్యూహాలను సిద్ధం చేసుకున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ సైతం తమ కోర్ టీమ్ తగ్గట్లుగా ఆటగాళ్లను ఎంచుకోవడంపై కన్నేసింది. వేలంలో టార్గెట్ చేయాల్సిన ఆటగాళ్ల జాబితాలను సిద్ధం చేసుకుంది. రిటెన్షన్ ప్రక్రియలో మొత్తం ఐదుగురి ఆటగాళ్లను రిటైన్ చేసుకున్న ఆరెంజ్ ఆర్మీ వారి కోసం రూ. 75 కోట్లు ఖర్చు చేసింది. హెన్రీచ్ క్లాసెన్(రూ. 23 కోట్లు), ప్యాట్ కమిన్స్(రూ. 18 కోట్లు), రూ. అభిషేక్ శర్మ(రూ. 14 కోట్లు), ట్రావిస్ హెడ్(రూ. 14 కోట్లు), తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డిని రూ. 6 కోట్లకు తీసుకుంది.

ఐదుగురి ఆటగాళ్లను మాత్రమే రిటైన్ చేసుకోవడంతో సన్‌రైజర్స్‌కు ఓ ఆర్‌టీఎమ్ ఆప్షన్ ఉంది. అయితే ఆ కార్డును అనామక ఆటగాళ్ల కోసమే ఉపయోగించాల్సి ఉంది. ప్రస్తుతం సన్‌రైజర్స్ హైదరాబాద్ పర్స్‌లో రూ. 45 కోట్లు మాత్రమే ఉన్నాయి. ఈ డబ్బులతో గరిష్టంగా 20 మంది.. కనిష్టంగా 18 మంది ఆటగాళ్లను తీసుకోవాల్సి ఉంది. గత సీజన్ మినీ వేలం తరహాలోనే ఆరెంజ్ ఆర్మీ ఓనర్ కావ్య మారన్ ట్రేడ్ మార్క్ లిస్ట్‌ను తయారు చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మిడిలార్డ్‌లో సత్తా చాటే బ్యాటర్లు కావాలి. ఆ స్లాట్‌ను దేవదత్ పడిక్కల్, ఇషాన్ కిషన్‌తో భర్తీ చేయాలనే లక్ష్యంతో ఆరెంజ్ ఆర్మీ ఉంది. ఈ ఇద్దరు చిక్కకపోతే.. అన్‌క్యాప్డ్ జాబితాలో అథర్వ టైడ్, నమన్ ధిర్, అభినవ్ మనోహర్‌లను తీసుకునే ప్రయత్నం చేయనుంది. అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డిలకు బ్యాకప్ ఆల్‌రౌండర్లుగా అబ్దుల్ సమద్‌తో పాటు సమీర్ రిజ్వీని టార్గెట్ చేయనుంది. ప్యాట్ కమిన్స్‌కు తోడుగా సన్‌రైజర్స్ హైదరాబాద్ అర్ష్‌దీప్ సింగ్, మహమ్మద్ షమీ, మహమ్మద్ సిరాజ్ వంటి భారత పేసర్లను సన్‌రైజర్స్ టార్గెట్ చేయనుంది. నటరాజన్, ఆవేశ్ ఖాన్‌ను తీసుకునేందుకు ప్రయత్నించనుంది. అయితే అర్ష్‌దీప్ సింగ్ వేలంలో చిక్కడం కష్టం. ఈ క్రమంలోనే షమీతో పాటు భువనేశ్వర్ కుమార్ కోసం సన్‌రైజర్స్ గట్టిగా ప్రయత్నించవచ్చు. స్పిన్ బౌలింగ్ ఆప్షన్‌లో బడ్జెట్ దృష్ట్యా సన్‌రైజర్స్ అకీల్ హొసేన్, పియూష్ చావ్లా, వానిందు హసరంగాల కోసం బిడ్ వేయవచ్చు. చాహల్, అశ్విన్ తక్కువ ధరకు చిక్కడం కష్టం.

### సన్‌రైజర్స్ టార్గెట్ చేసే బ్యాటర్ల లిస్ట్..

దేవదత్ పడిక్కల్(రూ. 2 కోట్ల కనీస ధర), ఇషాన్ కిషన్(రూ. 2 కోట్లు), నమన్ ధిర్(రూ. 30 లక్షలు), అథర్వ టైడ్(రూ. 30 లక్షలు), అబ్దుల్ సమద్(రూ. 30 లక్షలు).